నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. షాగంజ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. పురానీహవేలి విద్యుత్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. శారద కాలేజీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. పోలీసు క్వార్టర్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ప్రత్యేక పూజలు



మేయర్ విజయలక్ష్మితో కలిసి పూజల్లో పాల్గొన్న మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అఫ్జల్‌గంజ్: కాంగ్రెస్ ప్రభుత్వం సుభిక్షంగా ఉండాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి గోషామహల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మమతాగుప్తా, సంతోష్‌గుప్తా ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం వేములవాడ రాజన్న ఆలయానికి వెళ్లి వారు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మమతాగుప్తా, సంతోష్‌గుప్తా మాట్లాడుతూ..ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధి, ప్రగతి కొనసాగుతుందన్నారు. పేదల పక్షమే కాంగ్రెస్ ప్రభుత్వమని వారన్నారు.

గణేష్ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



అబిడ్స్: గణేష్ ఉత్సవాలకు జీహెచ్ఎంసీ–14వ సర్కిల్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం అబిడ్స్ మున్సిపల్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ సమితి నాయకులు, పలువురు అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం డీసీ మాట్లాడుతూ..ఏ ప్రాంతంలోనైనా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు గోవింద్‌రాఠీ, శ్రీరామ్‌వ్యాస్, నట్రాజ్ నాందారి, మెట్టు వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలి



అఫ్జల్‌గంజ్: నామినేటెడ్ పదవుల్లో మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మేరు సంఘం నాయకులతో కలిసి సోమవారం ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం ఆదిమూలం శంకర్ మాట్లాడుతూ..45 ఏళ్లుగా తెలంగాణ కాంగ్రెస్‌లో చురుకైన నాయకుడిగా, కాంగ్రెస్ జెండాలు మోసిన పోల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోల్కం వినయ్‌రాజ్, వెన్ను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాడభూషి శ్రీధర్‌కు రామానుజరావు పురస్కారం



సుల్తాన్‌బజార్: పాత్రికేయుడిగా, న్యాయ కోవిదునిగా, రచయితగా, న్యాయ శాస్త్ర పరిశోధకుడిగా, బహు గ్రంథ కర్తగా డాక్టర్ మాడభూషి శ్రీధర్ అసాధారణ కృషికి పేరు పొందారని వక్తలు ప్రశంసించారు. సోమవారం సాయంత్రం తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ దేవులపల్లి రామానుజరావు 108వ జయంతి ఉత్సవంలో కేంద్ర సమాచార పూర్వ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్‌కు రామానుజరావు పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1953లో అలంపురంలో దేవులపల్లి రామానుజరావు అధ్యక్షతన జరిగిన పరిషత్తు సభలది గొప్ప చరిత్ర అని కొనియాడారు. పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య, మంత్రి రామారావు, సిల్మా నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

గణేష్ ఉత్సవాలతో పాటు మిలాద్–ఉన్–నబీ వేడుకలకు సిద్ధం

- వెనువెంటనే ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తి చేయించే ప్రయత్నం
- 6 నెలల్లో అందుబాటులోకి స్టీల్ బ్రిడ్జ్
- చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



చార్మినార్: ప్రస్తుతం జంట ఉత్సవాలున్నాయని..ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వినాయక ఉత్సవాలతో పాటు మిలాద్–ఉన్–నబీ వేడుకల సందర్భంగా ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలాపూర్ నుంచి కొనసాగే నిమజ్జనోత్సవ ప్రధాన ఊరేగింపు పాతబస్తీ నుంచి కొనసాగుతుందని..ఈ రూట్‌లో బీటీ రోడ్లుతో పాటు అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు తదితర పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహించనున్నామన్నారు. ఇక ఇప్పటికే ప్రారంభమై నత్తనడకన కొనసాగుతున్న పలు ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నామని ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

పాతబస్తీలో ఇప్పటికే పని చేసిన అనుభవం ఉన్న మీరు ముందుగా చేపట్టే పనులేంటి..?

నేను 2015 మే 20 నుంచి 2018 మే 21 వరకు పని చేశా. పాతబస్తీలో గల్లీ గల్లీ తెలుసు. అప్పటికీ ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి. అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి.

ప్రధానంగా మీరు దృష్టిసారించే అంశాలేమిటి..?

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే నా ప్రధాన ఎజెండా.

కొన్ని సమస్యలు సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ..ఆయా సమస్యల పరిష్కారానికి ఉపక్రమించడం లేదు. ఏవేవో సాంకేతిక కారణాలతో కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి..?

అలాంటి దీర్ఘకాలిక సమస్యలుంటే.. నేను స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించడానికి కృషి చేస్తా.

కొంత మంది అధికారులు ఉద్దేశపూర్వకంగా తమ విధులకు సకాలంలో హాజరుకాకుండా సొంత పనులు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. వారిపై మీ వైఖరి ఏమిటి..?

విధినిర్వహణ పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠినంగా వ్యవహరించనున్నాం. శాఖాపరమైన చర్యలకు సైతం వెనుకాడేది లేదు.

చార్మినార్ జోన్ పరిధిలో ఎక్కడెక్కడ ప్రాజెక్ట్ పనులు కొనసాగుతున్నాయి..?

ఫలక్‌నుమాలో ఆర్‌ఓబీ, సంతోషనగర్ నుంచి చంచల్‌గూడ వరకు స్టీల్ బ్రిడ్జ్, కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, బండ్లగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ప్రాజెక్ట్ విభాగం ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి.

ఇవన్నీ నత్తనడకన కొనసాగుతున్నాయి..కదా..?

అవును. కొన్ని సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. అన్నింటినీ పూర్తి చేయించడానికి కార్యాచరణ రూపొందించాం.

స్టీల్ బ్రిడ్జ్ పిల్లర్ల సమస్య పరిష్కారమయ్యిందా..? ఎప్పటి లోగా నిర్మాణం పనులు పూర్తవుతాయి..?

సైదాబాద్ ప్రధాన రోడ్డులో ఏర్పడిన పిల్లర్ల సమస్య పరిష్కారమయ్యింది. రాబోయే 6 నెలల్లో స్టీల్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం.

ఉత్సవాలను పురస్కరించుకుని పోలీసులతో కలిసి కో ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించారా..? మీ పరిధిలో ఎన్ని పోలీసు జోన్లున్నాయి..? అవి ఏవేవీ..?

మా పరిధిలో సౌత్ జోన్‌తో పాటు సౌత్ ఈస్ట్ జోన్ పరిధులున్నాయి. ఇప్పటికి ఆయా జోన్‌ల డీసీపీలతో కలిసి కో ఆర్డినేషన్ సమావేశాలు జరిగాయి.

'ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నాం'



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ తదితరులు

చార్మినార్: ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నామని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సర్కిఫూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్లకి చెందిన ఇంజినీరింగ్ విభాగం సమస్యలపై–4 సంతోష్‌నగర్, ఫలక్‌నుమా సర్కిళ్లకు చెందిన టౌన్ ప్లానింగ్ సమస్యలపై–2, చార్మినార్ సర్కిలోని పారిశుద్ధ్య సమస్యపై ఒకటి, మొత్తం 7 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మలేరియా విభాగం ఎస్ఈ నామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



నియామకపత్రాలు అందజేస్తున్న టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. మన్నాన్‌ఖాన్ సౌజన్యంతో సోమవారం టోలిచౌకీ అల్ఫా గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించారు. వివిధ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో హాజరై తమకు కావాల్సిన యువతి, యువకులను ఇంటర్వ్యూలు చేశారు. ఈ సందర్భంగా నియమితులైన వారికి ఏసీపీ నియామక ఉత్తర్వులు అందించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ..మన్నాన్‌ఖాన్ గ్రూప్ వారు గత దశాబ్ద కాలంగా నిస్వార్థ సేవతో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, మన్నాన్‌ఖాన్, జీషాన్, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బార్ అండ్ రెస్టారెంట్ యజమానుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం రవీంద్రభారతిలో అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ మాట్లాడుతూ..నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపులు నడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వైన్‌షాపులకు రాత్రి 11 గంటల వరకు అనుమతిచ్చారని, ఆ సమయాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బార్, వైన్ షాపుల మధ్య 100 మీటర్ల దూరం ఉండే నిబంధనలను పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో కొత్త మద్యం పాలసీని తీసుకువస్తుందని ఆ పాలసీలో తమ సమస్యలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి మోహన్‌గౌడ్ జాయింట్ సెక్రెటరి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం'



షేక్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకులతో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ 21 బూత్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి స్థానికులను కలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేద బడుగు వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయబడుతున్నాయన్నారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ క్రమశిక్షణ గల నాయకుడని ఆయనతో కలిసి ప్రతి ఒక్కరూ షేక్‌పేట్ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చే విధంగా చూడాలన్నారు. నిజాం, స్వరూప, రమేష్, రాజు, రఘు, ఉమర్, క్రాంతి, అఫ్రోజ్ తదితరులున్నారు.

ఆటోలో మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత



గోల్కొండ: గోల్కొండ కోటకు వచ్చిన పర్యాటకులు తమ వస్తువులు ఉన్న బ్యాగును ఆటోలోనే మరిచిపోయారు. ఈ విషయంపై పర్యాటకులు గోల్కొండ పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేశారు. పోలీసులు రెండు గంటల్లోపే కేసును ఛేదించారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఇద్దరు పర్యాటకులు గోల్కొండ చూడడానికి వచ్చారు. వీరు గోల్కొండ కోట వద్ద ఆటోలో దిగి తమ బ్యాగును తీసుకోవడం మరిచారు. ఆటో డ్రైవర్ కూడా బ్యాగును చూసుకోలేదు. తమ బ్యాగు ఆటోలోనే ఉందని తెలుసుకున్న పర్యాటకులు వెంటనే గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే డీఎస్ఐ అంజనేయులు ఆటో వివరాలను తెలుసుకొని రెండు గంటల్లోపే ఆటోను గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. బ్యాగును స్వాధీనం చేసుకొని పర్యాటకులకు అప్పగించారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయం

గౌలిపురా: గణేష్, దుర్గామాత ఉత్సవాల కోసం ఏర్పాటు చేసే మండపాలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. లాల్‌దర్వాజాలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో జరుపుకొనే గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాటు చేసే మండపాలకు, దసరా నవరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాటు చేసే దుర్గామత మండపాలకు ప్రజా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ప్రజలు ప్రభుత్వ అధికారుల సూచనలు పాటిస్తూ అగ్ని ప్రమాదాలు జరగకుండా మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకొని ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

చెక్కుల పంపిణీ



గోల్కొండ: పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో లాభదాయకమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన ఆసిఫ్‌నగర్, గోల్కొండ మండలాలకు చెందిన నిరుపేదల కుటుంబాల వారికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో దూరదృష్టితో ప్రవేశపెట్టబడినవని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులున్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



మనీష్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపాల్ బి.సునీల్‌కుమార్ అన్నారు. బద్రుక కాలేజ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన కె.మనీష్‌గౌడ్ 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్ల విభాగాల్లో గెలుపొంది మూడు బంగారు పథకాలను సాధించాడు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

యువత ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి నవీన్ మిట్టల్, కళాశాల చైర్మన్ కె.కృష్ణారావు తదితరులు

అబిడ్స్: యువత ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ అన్నారు. స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ కె.కృష్ణారావు నేతృత్వంలో జరిగిన ఇంజినీరింగ్ కాన్‌క్లేవ్–2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రధానమైన రంగాలలో నూతనమైన సంస్కరణలను స్వీకరించాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలోని అభివృద్ధి వల్లనే సమాజం ముందుకు వెళ్తుందన్నారు. టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ప్రిన్సిపాల్ కన్సల్టెంట్ బాల ప్రసాద్ మాట్లాడుతూ... కృత్రిమ మేధ నేడు అన్ని రంగాల్లో తనదైన శైలిలో ప్రభావం చూపుతుందని తెలిపారు. కృత్రిమ మేధ చేత కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఏరోనాటికల్ తదితర ప్రధానమైన రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. బిట్స్ పిలానీ అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్ గుప్తా మాట్లాడుతూ..వాతావరణంలో జరుగుతున్న మార్పులు, కాలుష్యం తదితర సమస్యలను ఇంజినీరింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం కనుగొనాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ రాజు మాట్లాడుతూ.. రెండు వారాల పాటు జరిగే ఈ సమావేశంలో సాంకేతికపరమైన చర్చలు, పరిశోధన పత్రాల సమర్పణ తదితర అంశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం పూర్తిగా జ్ఞానాన్ని పంచుకుని పరస్పరం సహకరించుకోవడానికి ఒక వేదికగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు టి.రాకేష్‌రెడ్డి, ఆర్.ప్రదీప్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎ.వినయ్‌బాబు, డైరెక్టర్ డాక్టర్ వి.అనురాధ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.రమేష్ పాల్గొన్నారు.

ఓల్డ్ సిటీ కా రాజా..ఆగయా..



గణేష్ ఆగమన్ కార్యక్రమంలో రాకేష్ తివారీ, గాజుల అంజయ్య

చార్మినార్: ఓల్డ్ సిటీ కా రాజా పేరుతో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు నిర్వహించిన గణేష్ ఆగమన్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. భాజా భజంత్రీల నడుమ లాల్‌దర్వాజ మోడ్‌లో రాత్రంతా సందడి నెలకొంది. శశాంక్ తివారి ఆధ్వర్యంలో యువకులు దారిపొడవునా నృత్యాలు చేస్తూ లాల్‌దర్వాజ మోడ్‌లోని దమయంతి టవర్స్ వరకు గణేష్ ఆగమన్ ఊరేగింపు నిర్వహించారు. దమయంతి టవర్స్ వద్ద మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి, బీఆర్ఎస్ నాయకులు మల్యాల మధుసూదన్‌యాదవ్, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అనంతోజ్ హన్స్‌రాజ్ తదితరులు వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 27న వినాయక విగ్రహానికి మొదటి పూజ నిర్వహించనున్నామని నిర్వాహకులు శశాంక్ తివారి తెలిపారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, లంక లక్ష్మీనారాయణ, జగన్నాథ శర్మ

నాంపల్లి: యువ కళావాహిని ఆధ్వర్యంలో రచయిత శ్రీధర్ రచించిన 'చందమామ మసకేసిపోయే'(శ్రీధర కథలు) పుస్తకావిష్కరణ సభ సోమవారం మాసబ్‌ట్యాంక్ నఫీజ్ రెసిడెన్సీలోని గాయత్రీ సదనంలో జరిగింది. యువ కళావాహిని సంస్థ అధ్యక్షులు, కళా వాచస్పతి లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ కేవీ రమణాచారి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించించి ప్రసంగించారు. చందమామ మసకేసిపోయే కథలోని వర్ణన అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. నవ్య వార పత్రిక పూర్వ సంపాదకులు ఎ.ఎస్.జగన్నాథశర్మ సభను ప్రారంభించారు. ఆకాశవాణి పూర్వ కార్యక్రమ నిర్వహణాధికారి సుధామ, తెలుగు పండితులు ఆచార్య డాక్టర్ సి.వేణు, సుప్రియా చక్రవర్తి, యువ కళా వాహిని సంస్థ ఉపాధ్యక్షులు ఎం.ఎ.హమీద్ పాల్గొన్నారు.

మండపాలకు తరలుతున్న గణేష్ విగ్రహాలు



క్రేన్‌ల ద్వారా భారీ విగ్రహాల తరలింపు



ఇమాంపురా మండపానికి చేరిన విగ్రహంతో మధిర సత్యనారాయణ

అబిడ్స్/జియాగూడ: మూడు నెలల నుంచి ధూల్‌పేటలో తయారైన గణేష్ విగ్రహాలు మండపాలకు తరలుతున్నాయి. దీంతో ధూల్‌పేట ప్రాంతాలు వినాయక విగ్రహాల కొనుగోలుదారులతో పాటు భారీ విగ్రహాలను మండపాలకు తరలించేందుకు క్రేన్ సహాయంతో లారీలు, డీసీఎంలలో విగ్రహాలను పెట్టేందుకు చిన్న ట్రాలీలలో పెడుతున్న సమయంలో తీవ్రంగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. మంగళ్‌హాట్ పోలీసులు సీతారాంబాగ్ చౌరస్తా, గాంధీ పుత్లా చౌరస్తాలలో బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ చిన్నపాటి గణేష్ విగ్రహాల నుంచి భారీ విగ్రహాలు కొనేందుకు మండపాల నిర్వాహకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో రద్దీ తీవ్రంగా ఏర్పడుతుంది. ధూల్‌పేటలోని ప్రతి సందులో వినాయక విగ్రహాల తయారీలు విక్రయాలు జరుగుతున్నాయి.

గురువులకు సత్కారం



గురువులను సత్కరిస్తున్న మైథిలి దినకరన్

నాంపల్లి: మైథిలి ఆర్ట్స్ అకాడమీ 11వ వార్షికోత్సవం వేడుకలు జరిగాయి. ఈ వేడుకలను తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మైథిలి దినకరన్ శిష్య బృందం అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చారు. నాట్య కళలో ప్రతిభ కనబరిచిన శిష్యులకు నాట్య ముకుల అవార్డును ప్రదానం చేశారు. మైథిలి దినకరన్ కుమారుడు డార్విన్ వేంకటేశ్వర స్వామి రూపంలో చేసిన ప్రత్యేక నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. గురువు కృష్ణ ప్రియా తన సంగీత ప్రతిభకు గాన సిద్ధి అవార్డును, నాట్య గురువులు ఎం.శ్రీ వర్ష, జోగేశ్వరి బరిక్‌లకు నాట్య సిద్ధి అవార్డులతో సత్కరించారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నాంపల్లి: మట్టి వినాయకులనే పూజిద్దామని సింగరేణి డైరెక్టర్ పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ గౌతమ్ పొట్రు పిలుపునిచ్చారు. సింగరేణి భవన్‌లో సోమవారం ఆయన మట్టి వినాయక ప్రతిమలను ఉద్యోగులకు, అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పర్యావరణ హిత మైనింగ్‌కు మారుపేరుగా నిలుస్తున్న సింగరేణి సంస్థ, పర్యావరణహితంగా వినాయక చవితి పండుగను తమ ఉద్యోగులు నిర్వహించుకోవాలన్న ఉద్దేశంతో కొన్ని ఏళ్లుగా మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జీఎం మార్కెటింగ్ టి.శ్రీనివాస్, సింగరేణి భవన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

గోల్కొండ: మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణ హితమైనవని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్ జనహిత్ కార్యాలయం వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మట్టి వినాయక విగ్రహాలను ఇళ్లల్లో ప్రతిష్ఠంపజేసుకొని పూజించాలని కోరారు. మట్టి వినాయక నిమజ్జనం కూడా ఎంతో సులువు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జొన్నకుంటి మధుసూదన్, గోదా లక్ష్మీకాంత్ యాదవ్, శ్రీధర్‌సాగర్ తదితరులున్నారు.

గౌలిగూడలో..

సుల్తాన్‌బజార్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మట్టి గణపతుల విగ్రహాలనే పూజించాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ సూచించారు. ఈ మేరకు సోమవారం గౌలిగూడలో ప్రజలకు మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కెమికల్‌తో చేసిన గణపతుల విగ్రహాలను కొనుగోలు చేయకుండా మట్టి గణపతులను, ఈకో ఫ్రెండ్లీ వినాయకులను తెచ్చుకుని పూజించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రఘు, అమర్‌సింగ్, సందీప్, జగపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ